క్లుప్తంగా

రక్తదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం 35 మంది ఎన్‌సీసీ కేడెట్లు రక్తదానం చేశారు. కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటారు. విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, ఎన్‌సీసీ అధికారి, లుటినెంట్ ఎం.రామస్వామి, ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకులు

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వరాలయన్ని ఎన్నికల పరిశీలకులు గౌతం సింగ్, చిన్మయి పాటిల్‌లు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ చరిత్ర గురించి వివరించారు. ఆలయ ఈవో, స్వామి వారి చిత్రపటాలు, ప్రసాదాన్ని అందజేశారు.

'కోడ్' ఉల్లంఘించారని ఫిర్యాదు

మద్నూర్(జుక్కల్): మండల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు కొందరు బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారంటూ మండలంలోని అవాల్‌గావ్‌కు చెందిన సిద్ధూ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక రిటరి ్నంగ్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'ఆర్గానిక్'తో దిగుబడి ఎక్కువ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఆర్గానిక్ ఎరువుల వాడకం వల్ల దిగుబడి పెరుగుతుందని గ్రోమోర్ సంస్థ సిబ్బంది మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎల్లారెడ్డిలో రైతులకు ఆర్గానిక్ ఎరువుల వినియోగం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనిక ఎరువుల వినియోగం కంటే ఆర్గానిక్ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు.సిబ్బంది బాపురెడ్డి, రమేష్, రైతులు బాలకిషన్, ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

బలిదానోత్సవం



కామారెడ్డి అర్బన్: ఆర్యసమాజ స్థాపకులు దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆదివారం కామారెడ్డి ఆర్యసమాజంలో దయానంద సరస్వతి బలిదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేదమిత్ర, ఆర్యసమాజం అధ్యక్షుడు కంకణాల కిషన్, ప్రతినిధులు గరిపల్లి అంజయ్యగుప్తా, దువ్వల నారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

కామారెడ్డి అర్బన్: మానవసేవే మాధవ సేవగా భావించి అధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మైసూర్ శ్రీదత్తపీఠం ఉత్తరాధిపతి విజయానంద తీర్థ స్వామి అన్నారు. ఆదివారం విజయానంద తీర్థస్వామి కామారెడ్డి పట్టణ పరిధిలోని రామేశ్వరపల్లి సమీపంలోని శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నిర్వహించిన కార్తీకమాస ఉత్సవంలో పాల్గొన్నారు. గణపతి హోమంలో స్వామిజీ పాల్గొన్న అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆశ్రమ ప్రతినిధులు ఎల్.లక్ష్మణ్‌రావు, సీతారామరావు, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్



మద్నూర్(జుక్కల్): ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముజీబ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని రిటర్నింగ్ కార్యాలయంలో 2023 తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులలో ఉన్న సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే 27, 28 తేదీలలో ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది మద్నూర్ రిటర్నింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక చేయూత

రాజంపేట: రాజంపేట మండల కేంద్రానికి రంగ సాయవ్వ ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.5 వేలు అందజేసినట్లు మండల అధ్యక్షులు యాదవరెడ్డి తెలిపారు. టౌన్ అధ్యక్షులు గంగాధర్ గౌడ్, సీనియర్ నాయకులు వీరన్న పటేల్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయం

- బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం
- బాన్సువాడలో ముగ్గురు షాడో ఎమ్మెల్యేలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన అంతా అవినీతిమయమని బాన్సువాడ బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచానికే గురువుగా నిలిచిందన్నారు. భారతదేశం సత్తా అంటే ఏంటో సగర్వంగా చాటారన్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణలో ప్రభుత్వ పాలనను కేసీఆర్ భ్రష్టు పట్టించారన్నారు. ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు విషయాలపై చర్చించారు.

–సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



యెండల లక్ష్మీనారాయణ

■ ఎన్నికల ప్రచారం ఏవిధంగా ఉంది?

ప్రచారానికి మంచి స్పందన వస్తోంది. ఏ వాడకు వెళ్లినా ప్రజలు మోదీ పాలనను గుర్తు చేస్తున్నారు. బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు తెలియజేస్తున్నాం.

■ పార్టీశ్రేణుల సహకారం ఎలా ఉంది?

పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నా గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. స్వచ్ఛందంగా ప్రచారానికి వస్తున్న కార్యకర్తలు వాళ్ల ఇంటి నుంచే భోజనం తీసుకు వస్తున్నారు. ఏమీ ఆశించకుండా పనిచేస్తున్న కార్యకర్తలు నాకు తిరుగులేని బలం.

■ ఏఏ అంశాలపై..?

అభివృద్ధి, సంక్షేమం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల గురించి వివరిస్తున్నాం. గ్రామపంచాయతీలు, క్రీడాప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, హరితహారం కార్యక్రమాలకు వంద శాతం నిధులు, వైకుంఠధామాలు, సీసీ రోడ్లు, డ్రైన్లు, డంపింగ్ యార్డులకు 90శాతం నిధులు కేంద్రం నుంచే వస్తున్నాయి. ఉచిత రేషన్ బియ్యం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి 50 శాతం నిధులు, ఆశా, అంగన్‌వాడీ ఉద్యోగుల జీతాల్లో సింహభాగం, కేసీఆర్ కిట్లలో రూ.6వేలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందన్న విషయాలను వివరిస్తున్నాం. బీఆర్‌ఎస్ పెంచిన విద్యుత్, ఆర్టీసీ చార్జీలను ప్రజలకు తెలియజేస్తున్నాం.

■ మీ దృష్టికి వచ్చిన సమస్యలు..?

నియోజకవర్గంలో ముగ్గురు షాడో ఎమ్మెల్యేలు పెత్తనం చేస్తున్నారు. రోజూ రూ.కోట్లల్లో ఇసుక అక్రమ రవాణా అవుతున్న విషయం, తెలంగాణ తిరుపతి ఆలయంలో అవకతవకలు గురించి పలువురు చెబుతున్నారు. డబుల్ ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించి అసలైన అర్హులకు మాత్రం ఇవ్వలేదు.

■ మీరిచ్చే హామీలు..?

నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం. ఈ విషయంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, గతంలో వ్యవసాయ మంత్రిగా ఉండి కూడా ఏం మాట్లాడలేదు. విద్య, వైద్యం విషయాల్లో మరింతగా మెరుగైన సౌకర్యాల కల్పనకు పాటుపడతా. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అర్హులకు ఇళ్లు, పట్టాలు ఇప్పిస్తా. ఇసుకను స్థానికులకు అందుబాటులో ఉండేలా చేస్తా.

ఓటరు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి..



కూలీలను ఓటు అడుగుతున్న బీజేపీ నాయకులు

మద్నూర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం చేస్తూ ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. దొరికిన ప్రతి ఒక్కరిని కలిసి తమ పార్టీకి ఓటు వేయాలని కోరుతున్నారు. మండల కేంద్రానికి సమీపంలో బీజేపీ నాయకులు రోడ్డుపై వెళ్తుండగా మహిళ కూలీలు చేనులో పనులు చేసుకుంటుండగా ఆదివారం బీజేపీ నాయకులు వారి వద్దకు వెళ్లి బీజేపీ అభ్యర్థి అరుణతారకు గెలిపించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. దొరికిన ప్రతి అవకాశాలన్ని వదులుకోకుండా ఎన్నికల ప్రచారంలో నాయకులు బిజీబిజీగా మారారు.

మోసపోయి గోసపడొద్దు

- ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎన్నికలలో ప్రజలు వారి వజ్రాయుధంలాంటి ఓటును సక్రమంగా నినియోగించుకోకపోతే ఐదేళ్లపాటు మోసపోయి గోసపడాల్సి వస్తుందని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ పేర్కొన్నారు. జలాల్‌పూర్, ఆత్మకూర్, మాసాన్‌పల్లి, మాటూర్, వెంకంపల్లి, వదల్‌పర్తి, గోలిలింగాల తదితర గ్రామాలలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలలో భాగంగా వివిధ పార్టీల నాయకులు వచ్చి చెప్పే మాటలు విని సరైన నాయకుడ్ని ఎన్నుకోవాలన్నారు. తెలంగాణ రాకముందు, తెలంగాణ వచ్చిన తర్వాత పల్లెల పరిస్థితి ఎలా మారిందో గుర్తించాలన్నారు. భారతదేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పింఛన్లు ఇస్తున్నారన్నారు. ధర్మారెడ్డి నుంచి తాండూర్ మీదుగా వెంకంపల్లి వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించానన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలోని ప్రతి గుంటకు నీళ్లు ఇప్పించడం, ట్రెనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి చదువుకున్న యువకులకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడం, అసైన్‌మెంట్ భూములకు పట్టాలిప్పిస్తానని చెప్పారు. ఇక్కడే పుట్టి పెరిగిన తనను మరోమారు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందా డబ్బులు ఇవ్వాలని ప్లకార్డుల ప్రదర్శన

గత ఎన్నికల్లో తాము ఇచ్చిన చందా డబ్బులను ఇవ్వాలని కోరుతూ జలాల్‌పూర్‌లో ఆదివారం మహిళలు ప్లకార్డులను ప్రదర్శించారు. పోలీసులు జోక్యం చేసుకొని వారికి సర్ది చెప్పారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతో డబుల్ అభివృద్ధి

- ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రం డబుల్ అభివృద్ధి సాధిస్తుందని ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం రుద్రారం, మత్తమాల, జంగమాయిపల్లి, బ్రాహ్మణపల్లి, మాచాపూర్, ఎల్లారెడ్డి, తిమ్మారెడ్డి తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎల్లారెడ్డితో పాటు రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. వైస్ ఎంపీపీ నర్సింలు, బీజేపీ నాయకులు దేవేందర్, సతీష్, రాజేష్, తదితరులున్నారు.



భూములు కబ్జా చేయడానికే కేసీఆర్ వచ్చేది



కాంగ్రెస్‌లో చేరుతున్న నీలం మోహన్



కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ వనిత

- రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి

కామారెడ్డి రూరల్: కామారెడ్డిలోని పచ్చని పంట భూములను కబ్జా చేయడానికే సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు నీలం మోహన్‌తో పాటు 250 మంది కొండల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ భూబకాసురుడని కామారెడ్డి ప్రాంతంలోని పంట పొలాలను కబ్జా చేసేందుకే మాస్టర్‌ప్లాన్‌తో వచ్చారని, ఇందిరమ్మ ఇచ్చిన అసైన్డ్ భూములు 14 వేల నుంచి 15 వేల ఎకరాల భూమిని కబ్జా చేయడానికే పోటీ చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ను ఓడించే దమ్మున్న లీడర్ రేవంత్‌రెడ్డి కాబట్టే సోనియాగాంధీ ఆయనను కామారెడ్డి నుంచి బరిలో దింపారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నీలం వెంకటి, చెట్కూరి గంగారాం, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 10వ వార్డు కౌన్సిలర్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కౌన్సిలర్ వనితతో పాటు భర్త రవి, 12వ వార్డు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి నందిని, ప్రవీణ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కుల సంఘాల సభ్యులు..

బీబీపేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన పలు కుల సంఘాల సభ్యులు బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి ఆదివారం కాంగ్రెస్ నాయకుడు తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు సుతారి రమేష్, రాజు, భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి గెలుపు ఖాయం

దోమకొండ: కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి పాల్వాయి రజనీకుమారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో నిరుద్యోగులు ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి మాత్రం నాలుగు ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, తదితరులున్నారు.



వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో చేరుతున్న నేతలు



ప్రచారం చేస్తున్న పాల్వాయి రజనీకుమారి

కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలే

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

మాచారెడ్డి: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మళ్లీ కరెంటు కోతలు మొదలై రైతులు అధోగతి పాలవుతారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం పాల్వంచ మండల కేంద్రంతో పాటు భవానిపేట, మాచారెడ్డి మండలం చుక్కాపూర్, మాచారెడ్డి, అక్కాపూర్, ఘన్‌పూర్, లచ్చాపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మూడో సారి సీఎంను చేస్తే కామారెడ్డి నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. కేసీఆర్‌ను ఓడించడానికి ఢిల్లీ గద్దలు వచ్చి కామారెడ్డిలో వాలుతున్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను ఓడించేందుకు బీజేపీ, కాంగ్రెస్ నేతలు కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. వాళ్లు ఎన్ని పన్నాగాలు పన్నినా కేసీఆర్ విజయం సాధించడం పక్కా అన్నారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, జిల్లా కో–ఆప్షన్ మాజీ సభ్యుడు ముస్తాక్ హుస్సేన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్ చంద్రం, తదితరులున్నారు.



పాల్వంచలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్

కేసీఆర్ గెలిస్తే ఐటీ హబ్‌గా మారుతుంది

- బీఆర్‌ఎస్ కో–ఆర్డినేటర్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి



దోమకొండ: సీఎం కేసీఆర్ కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే కామారెడ్డి ఐటీ హబ్‌గా మారుతుందని ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ కో–ఆర్డినేటర్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం దోమకొండలో పద్మశాలి సంఘం ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ దేశంలోనే అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల కంటే కామారెడ్డి మరింత అభివృద్ధి చెందడానికి కేసీఆర్‌ను గెలిపించాలన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావ్, సంఘం ప్రతినిధులు ఉన్నారు.

సంక్షేమ ఫలాలే బీఆర్‌ఎస్ లక్ష్యం

- ఎమ్మెల్సీ బండ ప్రకాశ్



బీబీపేట: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడమే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమని, సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అన్నారు. ఆదివారం జనగామలో బీఆర్‌ఎస్ నేత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల వద్దకు ఎక్కడ వెళ్లినా బీఆర్‌ఎస్ పార్టీకి గొప్ప స్పందన లభిస్తుందని, రానున్న రోజుల్లో కామారెడ్డి మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇతర పార్టీల నాయకుల మాటలు నమ్మొద్దని, వారు ఆశల పల్లకిలో పథకాలు ప్రజలకు చూపుతున్నారని, వారి రాష్ట్రంలో అమలు చేయలేని పథకాలు ఇక్కడ ఎలా చేస్తారని ప్రశ్నించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికోసం కేసీఆర్‌ను గెలిపించండి

- ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్‌రెడ్డి



భిక్కనూరు: రాష్ట్రం, కామారెడ్డి ప్రాంతం పూర్తిగా అభివృద్ధి చెందేందుకు కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కాచాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశప్రజలందరూ కామారెడ్డి వైపు చూస్తున్నారని కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను భూస్థాపితం చేయాలన్నారు. మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్, సర్పంచ్‌లు తున్కి వేణు, సులోచన, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు

భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండ సాయిలు ముదిరాజ్ ఆదివారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల మండల ఫోరం కన్వీనర్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇనాంతండా నుంచి పలువురు

రాజంపేట: కొండాపూర్ గ్రామ పరిధిలోని ఇనాం తండాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, గ్రామ ఉపాధ్యక్షులు గణేష్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామ అధ్యక్షులు గొల్ల లచ్చయ్య, బీసీ సెల్ అధ్యక్షులు కొనకాలి నర్సింలు పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న తిప్పాపూర్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండ సాయిలు

మాజీ జెడ్పీటీసీ లతాగౌడ్ మృతి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మాజీ జెడ్పీటీసీ లతాగౌడ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధ పడుతున్న లతాగౌడ్ ఆదివారం మృతి చెందినట్లు వారు తెలిపారు. లతాగౌడ్ మృతి పట్ల పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



లతాగౌడ్ (ఫైల్)

'మంచి సంకల్పానికి భగవంతుడు తోడుంటాడు'

కామారెడ్డి అర్బన్: మంచి మనసుతో చేసే సంకల్పానికి భగవంతుడు ఎప్పుడు నీడలా తోడుంటాడని కామారెడ్డి చండీ మంత్రాలయ ఆశ్రమ పీఠాధిపతి నిత్యముక్త ప్రియానందస్వామి అన్నారు. ఆదివారం ఆశ్రమంలో 'ఉషా పవనాలు' అధ్యాత్మిక పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రియానంద స్వామి మాట్లాడుతూ.. పుస్తక రచయిత ఉషాబాల, పవన్‌కుమార్ దంపతులు ఎన్నో పదవులు నిర్వహించి తమ శేష జీవితాన్ని కాశీలో అన్నపూర్ణ, విశ్వనాథుని సన్నిధిలో సేవా కార్యక్రమాల్లో గడపడానికి తమ యావదాస్తిని సేవా సంస్థకు విరాళంగా ఇచ్చారన్నారు. ఇలాంటి వారు అరుదుగా ఉంటారని అభినందించారు. సమన్వయకర్త చంద్రశేఖర్ హాజరయ్యారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రియానందస్వామి

కరెంట్ కష్టాలు తీర్చిన కేసీఆర్‌కే ఓటు

- జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

నిజాంసాగర్(జుక్కల్): కరెంట్ కష్టాలను తీర్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. ఆదివారం మహమ్మద్‌నగర్ మండలంలోని తుర్కపల్లి, తున్కిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధేకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇళ్ల వద్ద ఉన్న అవ్వలకు దండం పెడుతూ కేసీఆర్ పథకాలను గుర్తు చేశారు. ఆమె వెంట జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, సర్పంచ్ లింగాల వసంత, ఎంపీటీసీ పుప్పాల లచ్చవ్వ తదితరులు ఉన్నారు. అలాగే నిజాంసాగర్ మండల కేంద్రం ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేశారు.



దండం పెట్టి ఓటు అడుగుతున్న దఫేదార్ శోభ



నిజాంసాగర్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ జ్యోతి

బీఆర్‌ఎస్‌కు 70 నుంచి 80 సీట్లు ఖాయం

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 70 నుంచి 80 సీట్లు రావడం ఖాయమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు మంచి ఆదరణ ఉందని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు జాగ్రత్తగా ఆలోచన చేసి ఓట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, మండల రైతు కమిటీ అధ్యక్షుడు భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

నిజాంసాగర్(జుక్కల్): హసన్‌పల్లి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ తన అనుచరులతో కలిసి ఆదివారం జుక్కల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మద్నూర్ మండలం మేనూర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.